క్లుప్తంగా

గృహ నిర్మాణాలు వేగవంతం

సారవకోట: గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ విశ్వేశ్వరరావు ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. గురువారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఖాళీ స్థలాలున్న వారు ఇళ్లు నిర్మించుకునేందుకు దరఖాస్తు చేసుకుంటే నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించాలన్నారు. పునాదులు వేసుకున్న, లింటల్ లెవల్‌లో ఉన్న వాటికి జియో టాగింగ్ చేయాలని సూచించారు. దీనిపై సచివాలయ స్థాయిలో ఉన్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు దృష్టి సారించి నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. గృహ నిర్మాణ శాఖ డీఈఈ అప్పారావు, ఎంఈఓ ఎం.వి.రమణ, ఏఈ ప్రసాదరావు ఉన్నారు.

లక్ష్యాలు మేరకు పనిచేయాలి

సరుబుజ్జిలి: ప్రభుత్వ లక్ష్యాలు మేరకు అధికారులు పనిచేయాలని ఎంపీడీఓ పీవీ మురళీమోహన్‌కుమార్ తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలన్నారు. వైద్యాధికారి భవ్యశ్రీ, వైకేపీ ఏపీఎం కమలకుమారి పాండ్యన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జానకి, ఈఓపీఆర్డీ ఆనంద్, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

దేశ సేవ ఎంతో గర్వకారణం

సరుబుజ్జిలి: యువత సైన్యంలో చేరి భరతమాతకు సేవ చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జి హెచ్‌ఎం కూన వనజాక్షి తెలిపారు. కెరీర్ గైడెన్స్ పేరిట పాఠశాలలోని 9, 10 తరగతుల విద్యార్థులకు భారత సైన్యం పిలుస్తోంది అన్న అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కెరీర్ గైడెన్స్ అధ్యాపకుడు మందపల్లి రామకృష్ణారావు సమన్వయకర్తగా వ్యవహరించారు. ప్రోగ్రాం ఇన్‌స్ట్రక్టర్ బి.వి.రమణ, ట్రైనీ ఇన్‌స్ట్రక్టర్లు కిశోర్, రాజు, పాపారావు, రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరుని కల్యాణం


వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని తురకపేట సెంటర్‌లో ఉన్న వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా లక్ష్మీవేంకటేశ్వర స్వాముల కల్యాణాన్ని నిర్వహించామని ఆలయ అర్చకులు మొజ్జాడ కృష్ణమాచారి తెలిపారు. భక్తులకు స్థానికులు అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు.

జాబ్‌కార్డు ఉంటే ఉపాధి

ఆమదాలవలస రూరల్: జాబ్‌కార్డు కలిగి ఉన్న కుటుంబాలకు ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు అన్నారు. మండలంలో చిట్టివలస పంచాయతీ పరిధిలో అమృత్ సరోవర్ చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం పరిశీలించారు. కూలీలతో రెండు పూటలా పనులు చేయించి, సగటు వేతనం రూ.250కు తగ్గకుండా ఉండాలని పేర్కొన్నారు. వంద రోజుల పనిదినాలపై దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. ఎంపీడీఓ ఎం.రేణుక, ఏపీఓ లక్ష్మీనరసమ్మ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

100 రోజులు పని దినాలు పూర్తిచేయాలి

మెళియాపుట్టి: మార్చి నెలాఖరుకల్లా ప్రస్తుతం ఉపాధి హామీలో పనిచేస్తున్న ప్రతీ కుటుంబం 100 రోజుల పనిదినాలను పూర్తిచేసేలా సిబ్బంది బాధ్యత వహించాలని ఏపీడీ మురళీకృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. డ్వామా పీడీ ఆదేశాల మేరకు ప్రతీ గ్రామంలో 150 మంది వేతనదారులకు తగ్గకుండా పనుల్లో పెట్టాలన్నారు. ఎంపీడీఓ పడాల చంద్రకుమారి, ఏపీఓ రవి, ఈసీ ఆదినారాయణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

హిరమండలం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోనూ ఉపాధి పనులను చేపట్టాలని క్లస్టర్ ఏపీడీ పి.రాధ అన్నారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో గురువారం సమీక్ష నిర్వహించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్నారు. ప్రతీ గ్రామంలో 200 మంది వేతనదారులకు తగ్గకుండా చూడాలన్నారు. వందరోజుల పని దినాలు పూర్తికావాలన్నారు. ఎంపీడీఓ బి.శైలజ, ఏపీఓ శ్రీనివాసరావు, ఈసీ సంతోష్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం

నరసన్నపేట: మేజరు పంచాయతీ పరిధిలోని వాడుకలో ఉన్న చెరువుల వద్ద పరిశుభ్రతకు ప్రాధా న్యత ఇస్తామని సర్పంచ్ బూరల్లి శంకర్ అన్నారు. గురువారం స్థానిక సంతపేట వద్ద చెరువు చుట్టూ ఉన్న పూడికను తొలగించారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

హిరమండలం: వృద్ధాప్యంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనలో ఉండాలని సత్యసాయి అన్నపూర్ణ సేవా సంఘం (రిమ్స్) అధ్యక్షుడు గంగుల రమణబాబు అన్నారు. గురువారం స్థానిక ప్రేమసాయి వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఆశ్రమ వాసులనుద్దేశించి మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఆశ్రమంలో జరుగుతున్న సేవలను పరిశీలించారు. ఆశ్రమ అభివృద్ధి కమిటీ సభ్యులు చంటి మాస్టర్, జోషుల గోవిదంశర్మ, ఆశ్రమ మేనేజర్ జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

విపత్తులు ఎదుర్కోండిలా..


మాక్‌డ్రిల్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ, అధికారులు

- ప్రమాదాల సమయంలో అందరి సహకారం అవసరం
- ఆర్డీఓ బి.శాంతి

పొందూరు, ఎచ్చెర్ల క్యాంపస్: విపత్తుల సమయంలో ప్రాణనష్టం నివారణకు అందరి సహకారం అవసరమని శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి బి.శాంతి వెల్లడించారు. పరిశ్రమల్లో ప్రమాదాలపై పలు కంపెనీల్లో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు చిలకపాలెంలోని నాగార్జున అగ్రికం లిమిటెడ్‌లో క్లోరిన్ గ్యాస్ లీకేజీ అయితే తీసుకోవాల్సిన చర్యలపై పొందూరు మండలం కేశవదాసుపురం, ఎచ్చెర్ల మండలం అరిణాంఅక్కివలస గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖలు నిరాటంకంగా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. విపత్తు సంభవించినపుడు ఎలా స్పందించాలో, ఎలా అప్రమత్తం కావాలో మాక్‌డ్రిల్ ద్వారా చూపించారు. జిల్లా అగ్నిమాపక అధికారి వీరభద్రరావు మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌సీఎల్‌లో ప్రమాదం జరిగితే ప్రజలంతా తమవంతు సహకారం అందించి ప్రాణ నష్టం నివారణకు సహకరించాలని కోరారు. అనంతరం నిర్వహించిన సమావేశానికి పరిశ్రమలశాఖ సేఫ్టీ అధికారి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఎస్‌ఎఫ్‌సీఎల్ ఉపాధ్యక్షుడు శేషగిరిరావు మాట్లాడుతూ మాక్‌డ్రిల్ ద్వారా జరగబోయే ప్రమాదాల పట్ల అవగాహన ఉంటుందని, ఇందుకు సహకరించిన అధికారులు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. డీఎస్పీ మహేంద్ర, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శంకర్‌నాయక్, పరిశ్రమలశాఖ మేనేజర్ ఉమామహేశ్వరరావు, జాతీయ విపత్తుల నిర్వహణశాఖ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పి.రాము, ఎంపీఐ గంగాధర్, ఏఎస్‌ఎఫ్‌సీఎల్ జనరల్ మేనేజర్ కె.శ్యాం ప్రసాద్, డీజీఎం పీఎస్‌వీఎస్ఎస్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

• స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్సీ రఘురాజు



ఆమదాలవలస పట్టణంలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో స్పీకర్ తమ్మినేని సీతారాంను ఆమదాలవలస నియోజకవర్గ పరిశీలకుడు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు గురువారం కలిశారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు అత్యధికంగా మొదట ప్రాధాన్యతా ఓట్లు పోలవడానికి ఆమదాలవలస నియోజకవర్గ పరిధిలో అనుసరించాల్సి పద్ధతులు, ప్రచార విధానాలపై చర్చించారు. ఒక్కో పోలింగ్ బూత్‌కు 10 మంది చొప్పున పీఓసీలను నియమించాలని స్పీకర్‌ను కోరారు.

– ఆమదాలవలస

క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించవచ్చు

- రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ స్వామినాయుడు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

నరసన్నపేట: ప్రాణాంతకమైన నోటి క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తించవచ్చని, ఈ క్యాన్సర్ నిర్ధారణ అయిన వారి జీవన ప్రమాణాలను పెంపొందించవచ్చని శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రి (రిమ్స్) సూపరింటెండెంట్ డాక్టర్ స్వామినాయుడు అన్నారు. నడగాంలో 'నోటి క్యాన్సర్ ముందస్తు గుర్తింపు', తదుపరి చికిత్సపై ప్రభుత్వ వైద్య కళాశాల, సర్వజన ఆస్పత్రిలో దంత వైద్య విభాగం సౌజన్యంతో అవగాహన వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం నిర్వహించారు. నడగాం పరిసర గ్రామాలకు చెందిన 128 మందికి 'వెల్‌స్కోప్' అనే అత్యాధునిక పరికరం ద్వారా తనిఖీలు చేశారు. 15 మందికి క్యాన్సర్ మొదటి స్టేజ్‌లో ఉన్నట్లు గుర్తించి వారికి తదుపరి చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా నోటి క్యాన్సర్‌పై ప్రత్యేక అవగాహన కల్పించారు. పొగతాగే వారు, పొగాకు నమిలే వారు, అడ్డ పొగ పీల్చేవారు, ఖైనీ, గుట్కా అలవాటు ఉన్నవారికి నోటి క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంటుందని, తనిఖీలు చేయించుకోవడం మంచిదన్నారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు లుకలాపు రవి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు సునీల్‌నాయక్, లుకలాపు ప్రసన్నకుమార్, ఎం.వి.సత్యానంద్, వి.వరప్రసాద్, ఎస్.రూప, జనార్దనరావు, నిహారిక, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ


పౌష్టికాహార ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న కృష్ణచైతన్య, తదితరులు

నరసన్నపేట: క్షయ రోగుల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, వాటిని రోగులు సద్వినియోగం చేసుకోవాలని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. స్థానిక వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో క్షయ రోగులకు పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ రోగులకు ప్రభుత్వం ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తుందని, విలువైన మందులు పంపిణీ చేస్తుందన్నారు. దాతల సహకారంతో పౌష్టికాహారం పంపిణీ చేయిస్తుందన్నారు. జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్.అనురాధ మాట్లాడుతూ జిల్లాలో గత ఆరు నెలలుగా 595 క్షయ రోగులను గుర్తించామన్నారు. వీరందరికీ పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం జనవరి నుంచి డిసెంబర్ వరకు 2,800 క్షయ రోగులను గుర్తించి చికిత్స అందించామన్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఇంతవరకు 2,500 మంది క్షయ రోగులకు పౌష్టికాహారం జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేశామన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ జయశ్రీ, డాక్టర్ రెడ్డీస్ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ బి.సురేష్, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్ పాల్గొన్నారు.

గ్రానైట్ యూనిట్ పరిశీలన


మ్యాప్ పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి

సారవకోట: మండలంలోని అలుదు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సమీపంలో ఉన్న గ్రానైట్ పాలిసింగ్ యూనిట్‌ను టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ యూనిట్ ప్రభుత్వ స్థలంలో నిర్మించారని ఓ స్వచ్ఛంద సంస్థ నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీ చేపట్టారు. మండల, సచివాలయ సర్వేయర్లతో ఆ చుట్టు పక్కల ఉన్న స్థలాలను కొలతలు వేయించి, ఆ స్థలం పూర్తిగా జిరాయితీ అని, ఆ యూనిట్ నిర్మాణం చేపట్టిన స్థలం ప్రభుత్వ స్థలంలో నిర్మించలేదని నిర్ధారించినట్లు తహసీల్దార్ ప్రవల్లికాప్రియ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం నిర్మిస్తున్న స్థలంలో పురాతన చెట్లు తొలగించారని వచ్చిన ఫిర్యాదు మేరకు ఆ స్థలాన్ని కూడా పరిశీలించారు. ఈ రెండు ఫిర్యాదులపై పూర్తిస్థాయి నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు అందించనున్నట్లు సబ్‌కలెక్టర్ తెలిపారు. పంచాయతీరాజ్ ఎస్ఈ వీఎస్ఎన్ నాయుడు, డీఈఈ సత్యంనాయుడు, మండల సర్వేయర్ మహేశ్, ఆర్ఐ బేగం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

140 మందికి నేత్ర పరీక్షలు

పోలాకి: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా పిన్నింటిపేటలోని స్థానిక సత్యసాయి భజన మండలి సహకారంతో గురువారం 140 మందికి నేత్రపరీక్షలు నిర్వహించినట్లు శంకర్ ఫౌండేషన్ క్యాంప్ మేనేజర్ అప్పలరాజు తెలిపారు. అవసమైన వారికి కళ్లద్దాలు ఉచితంగా పంపిణీ చేయటంతోపాటు, శస్త్రచికిత్సలు విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్‌లో చేయనున్నట్లు చెప్పారు. సత్యసాయి భజన మండలి అధ్యక్షుడు జామి మహేష్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి బోరుకు భూమిపూజ

కొత్తూరు: మండలంలోని మాకవరంలో తాగునీటి బోరుకు వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు గురువారం భూమిపూజ చేశారు. దశలవారిగా తాగునీటి సమస్య తీర్చడం జరుగుతుందన్నారు. ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటా కుళాయిలు పనులు మంజూరుకావడంతో ఆయా గ్రామాల్లో పైపులైన్ల పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు చెప్పారు. ఎంపీటీసీ చీకటి వీర్రాజు, సర్పంచ్ గార భాస్కరరావు, మాజీ సర్పంచ్ పడాల వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాపుగోపాలపురంలో ఫ్యామిలీ డాక్టర్

పాతపట్నం: మండలంలోని కాపుగోపాలపురం గ్రామంలో బైదలాపురం పీహెచ్‌సీ వైద్యుడు ఐ.శ్రీధర్ ఆధ్వర్యంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలతో పాటు మంచం పట్టిన రోగులకు బీపీ, సుగర్ వంటి సమస్యలతో బాధపడుతున్నవారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఏఎన్ఎం జ్ఞానమ్మ, ఆశ వర్కలు, వలంటీర్లు పాల్గొన్నారు.

భూ వివాదంపై విచారణ

కొత్తూరు: మండలంలోని ఆకులతంపర గ్రామానికి చెందిన రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమరాజపురం సచివాలయంలో భూ వివాదంపై తహసీల్దార్ బాల విచారణ గురువారం చేపట్టారు. కౌలుకు ఇచ్చిన భూములను సాగుచేస్తున్న రైతులు వారి పేర్లపై పాస్ పుస్తకాలు చేయించుకున్నారని అదే గ్రామానికి చెందిన కరకవలస శ్యామ సుందరాజు, మోహన్‌కుమార్ రాజు, బ్రొజ కిశోర్‌రాజుతో పాటు పలువురు రైతులు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. 100 ఏళ్ల నుంచి తమ తాత, తండ్రుల నుంచి సాగుచేయడంతో ఆ భూములు తమకు దాఖలుపడటంతో క్రయి దస్తావేజీలు, పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉన్నాయంటూ చల్ల రవికిరణ్, చల్ల సింహాచలం, శామ్యూల్, బాబూరావుతోపాటు పలువురు రైతులు తహసీల్దార్‌కు వివరించారు. రీ సర్వేలో మాత్రం ప్రస్తుతం సాగు చేస్తున్న రైతుల పేర్లుపై భూములు నమోదు కావడంతోపాటు ఆ రైతుల పేరిట రికార్డులు ఉన్నాయని సర్వేయర్, వీఆర్వోలు తెలిపారు. భూములు సాగు చేయడంతోపాటు, ఆ భూములకు సంబంధించిన రికార్డులు ఉన్న రైతుల పేరుపై భూములు నమోదు చేయడం జరుగుతుందని తహసీల్దార్ చెప్పారు. సుమారు 40 ఏళ్లు దాటిసాగు చేస్తున్నందున ఆ రైతులు పేరున భూములు నమోదు చేస్తామన్నారు. రీసర్వే డీటీ వెంకటరావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

సారవకోట: పట్టభద్రుల ఎంఎల్సీ ఎన్నికల కోసం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఎంపీడీఓ విశ్వేశ్వరరావు, ఎంఈఓ ఎంవి.రమణ గురువారం పరిశీలించారు. ఎన్నికల నిర్వాహణకు అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న స్టడీ అవర్స్‌ను పరిశీలించి, రానున్న 10వ తరగతి పరీక్షలలో శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలిచ్చారు. హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పోలాకి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ దూరవిద్యలో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.అన్నపూర్ణారావు గురువారం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఇంటర్ చదవనివారు, మధ్యలో ఆపేసిన వారికి ఇది మంచి అవకాశమన్నారు. ఈ నెల 27లోగా కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

'ఈనాడు' అబద్ధాల పుట్ట


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కొత్తూరు: టీడీపీ నాయకుడు పట్టాభిని గన్నవరంలో పోలీసులు కొట్టారని ఈనాడులో 2021 ఫిబ్రవరి మూడో తేదీన ప్రచురించిన ఫొటోను తిరిగి ఈ నెల 22న వేయడం ఆ ప్రతిక అబద్ధాల పుట్ట అనడానికి నిదర్శమని ఎమ్మెల్యే రెడ్డి శాంతి దుయ్యబట్టారు. మండలంలోని ఇరపాడులో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఇటువంటి తప్పుడు కథనాలు రాయడం ఆ పత్రికకు అలవాటేనన్నారు. చంద్రబాబును సీఎం చేసేందుకు ఇటువంటి అనైతికానికి ఒడిగడుతుందన్నారు. పాత ఫొటోలను చూపించి ప్రజలకు మోసం చేసిన ఆ పత్రికను బహిష్కరించాలని పాఠకులకు పిలుపునిచ్చారు. ఆ పత్రిక ఎన్ని తప్పుడు కథనాలు ప్రచురించినా ప్రజలు గుండెల్లో ఉన్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి 2024 ఎన్నికల్లో కూడా రెండోసారి అధికారం కట్టపెట్టేందుకు ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారన్నారు. పీఏసీఎస్ అధ్యక్షుడు చింతాడ సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు లోలుగెడ్డ తిరుపతిరావు, కామక త్రినాథరావు, సర్పంచ్ ధర్మారావు, పిన్నింటి శేషగిరి, తమ్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల అభివృద్ధికి సీఎం జగన్ కృషి

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి


ఎమ్మెల్యే రెడ్డిశాంతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గురాడి అప్పన్న

పాతపట్నం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నివర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని పాతపట్నం ఎమెల్యే రెడ్డి శాంతి అన్నారు. వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగం ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన గురాడి అప్పన్న గురువారం పాతపట్నంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యకు దూరమైన వర్గాలను సీఎం జగన్ గుర్తించి, అందరికీ సమానంగా విద్యా వకాశాలను కల్పించారన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచి పేదరికాన్ని రూపుమాపడంతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలను అన్ని రంగాల్లో ముందు వరుసలోకి తెస్తున్నారన్నారు. గురాడ అప్పన్న మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.శ్యామ్ సుందరావు, వైస్ ఎంపీపీ సవిరిగాన ప్రదీప్, వైఎస్సార్‌సీపీ నాయకులు దొర పార్వతీశం, పద్మరాజు, సూర్యం, పనుకు మోహన్, జి.రాము, శ్రీధర్, సత్యబిశాల్, మన్మధరావు, శ్రీనివాసరావు, ఢిల్లేశ్వర రావు, తరుణ్, జీవ, సాయి పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడికి ఖండన


నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

ఆమదాలవలస: న్యాయవాదులకు రక్షణ కల్పించాలని ఆమదాలవలస బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కణితి విజయలక్ష్మిబాయి ప్రభుత్వాన్ని కోరారు. రంగారెడ్డి కోర్టు న్యాయవాది నాగపాటి సురేంద్రపై ప్రత్యర్థులు చేసిన దాడిని ఖండిస్తూ గురువారం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో న్యాయవాదులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం విధులను బహిష్కరించారు. వృత్తి రీత్యా ఏమైనా ఇబ్బందులుంటే న్యాయపరంగా తేల్చుకోవాలి కానీ దాడికి పాల్పడడం సమంజసం కాదన్నారు. సీనియర్ న్యాయవాదులు పి.వి.నరసింగరావు, బి.సీతారాం, తమ్మినేని అన్నంనాయుడు, కె.త్రినాథరావు, రాజేంద్ర, రమణమూర్తిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు పరామర్శ


మెళియాపుట్టి: బాధితులను పరామర్శిస్తున్న పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మెళియాపుట్టి: మండలంలోని దీనబంధుపురం గ్రామానికి చెందిన అగ్నిప్రమాద బాధితులను పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డిశాంతి గురువారం పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. హరిపురం పున్నయ్యకు చెందిన రేకిల్లు కాలిపోయి ఒకవైపు గోడకూలిపోయిందని, ఆదివారం శుభకార్యం ఉండటంతో తీసుకువచ్చిన దుస్తులు, బియ్యం, సరుకులు, రూ.20 వేల నగదు కాలిపోయాయన్నారు. ఆ పక్కనే ఉన్న జన్ని సోమేష్, జన్ని సుందరమ్మ, పడాల సోమయ్యుల పశువుల శాలలు కాలిబూడిదయ్యాయన్నారు. హరిపురం రామారావుకు చెందిన వ్యవసాయ కోతమిషన్ కాలిపోయిందన్నారు. నష్టాన్ని అంచనా వేయాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. జెడ్పీటీసీ గూడ ఎండయ్య, మండల కన్వీనర్ పల్లి యోగి, మండల సచివాలయ కన్వీనర్ల ఇంచార్జి గణపతి ప్రధాన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బైపోతు ఉదయ్ కుమార్, స్థానిక సర్పంచ్ సవర కావేరి, పి.జయమునిరావు ఉన్నారు.

కొత్తూరు: మండలంలోని ఇరపాడు గ్రామానికి చెందిన మీసాల షణ్ముఖరావు ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం పరామర్శించారు. పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, ధర్మారావు, పూర్ణ, శ్రీనివాసరావు, కామక త్రినాథరావు, లోతుగెడ్డ తిరుపతిరావు తదితరులు ఉన్నారు.

నిరాధార వార్తలు ప్రచురించడం తగదు


- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్



ఈనాడు పత్రికను తగలబెడుతున్న తమ్మినేని చిరంజీవినాగ్, తదితరులు


ఆమదాలవలస: నిరాధారమైన వార్తలు ప్రచురించడం ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలకు తగదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. ఆ పత్రికల్లో వచ్చిన అవాస్తవమైన వార్తలపై స్పందిస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గురువారం సాయంత్రం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేస్తూ ఆయా పత్రికలను తగలబెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకుడు పట్టాభి వార్తను 2021 నాటి ఫొటోలతో ప్రచురించిడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చంద్రబాబు ఆదేశాలతో నిత్యం నిరాధారమైన తప్పుడు కథనాలు రాస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఈనాడు పత్రికను ఎవరూ వేయించుకోవద్దని కార్యకర్తలకు సూచించారు. రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తూ చేస్తున్న కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ఎందుకు ఆ పత్రికల్లో ప్రచురించరని ప్రశ్నించారు. ఏది ఏమైనా ఎన్ని తప్పుడు వార్తలు రాసినా ప్రజలు టీడీపీని, ఆ పత్రికలను నమ్మరని తేల్చిచెప్పారు. మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కె.శ్యామ్‌ప్రసాద్, పార్టీ మున్సిపల్ మాజీ వైస్‌ఫ్లోర్ లీడర్ ఎ.ఉమామహేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు, పార్టీ నాయకులు బి.రాజు, గొంటి కృష్ణ, శిష్టకరణ రాష్ట్ర డైరెక్టర్ కె.వి.రమణమూర్తి, పి.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

నమ్మకాన్ని నిలబెడతా..


గిరీశ్వరరావు


నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడిగా తనకు అప్పగించిన బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తానని, పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పతివాడ గిరీశ్వరరావు అన్నారు. జిల్లా సేవాదళ్ అధ్యక్షుడిగా పార్టీ అధిష్టానం నియమించడాన్ని స్వాగతించారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా సేవాదళ్‌ను నడిపిస్తానన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్యకు కృతజ్ఞతలు తెలిపారు.

బాధ్యత మరింత పెరిగింది


దామ మన్మథరావు

జలుమూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా దామ మన్మథరావును పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ వెల్లడించినట్లు మన్మథరావు గురువారం తెలిపారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి మరింత బాధ్యత అప్పగించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే కృష్ణదాస్, పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్యకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేస్తానన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి


రమణమూర్తి

ఆమదాలవలస: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానని పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియామకమైన మూడడ్ల రమణమూర్తి అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. పార్టీ ఆవిర్భావం నుంచి సేవలు అందిస్తున్నానన్నారు. జిల్లాలోని బీసీలందరినీ కలిసి సమన్వయం చేసుకుని పార్టీ బలోపేతానికి తనవంతు కృషిచేస్తానన్నారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన సీఎం జగన్‌మోహన్ రెడ్డికి, స్పీకర్ తమ్మినేని సీతారాంకు, పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.